# అతి పరిశుద్ధ విశ్వాసం



పరిశుద్ధ గ్రంథం యొక్క ప్రాథమిక సత్యాలు

**పాఠం -- 7**

# అతి పరిశుద్ధ విశ్వాసం

నేడు మనం అతి పరిశుద్ధమైన విశ్వాసం అనే పాఠాన్ని పరిశీలించేటప్పుడు,

- ✓విశ్వాసం అంటే ఏమిటి?
- ✓విశ్వాసానికి, అతి పరిశుద్ధమైన విశ్వాసానికి ఉన్న వ్యత్యాసం ఏమిటి?
- ✓విశ్వాసం ఎలా వచ్చింది?
- ✓ఎవరి ద్వారా వచ్చింది?
- ✓విశ్వాసాన్ని చెడగొట్టినది ఎవరు?

ఇలాంటి అనేక ప్రశ్నలతో అతి పరిశుద్ధమైన విశ్వాసం అనే పాఠాన్ని దేవుని వాక్య ఆధారంగా పరిశీలిద్దాం.

## విశ్వాసం అంటే ఏమిటి?

**హెబ్రీయులకు 11 : 1**

**విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజ స్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది.**

విశ్వాసం అంటే, మనం చూడని దానిని పొందుకుంటాము అనే విషయంలో సందేహానికి తావు లేకుండా నమ్మడంలో ఉన్న నిశ్చయత. అంటే, కనబడని వాటిని పూర్తి నిశ్చయతతో నమ్మడమే విశ్వాసం. కాబట్టి, దేవుని వాక్య ఆధారంగా, అది కూడా ఎటువంటి సందేహానికి తావు లేకుండా అదృశ్యమైన వాటి పట్ల ఉన్న నిశ్చయతనే విశ్వాసం అంటారు.

## విశ్వాసం – నిరీక్షణ వీటి వ్యత్యాసం

విశ్వాసానికి, నిరీక్షణకు ఉన్న వ్యత్యాసం ఏమిటంటే, ఏ స్థితిలోనైనా ఎదురుచూసే వాటిలో మార్పులేనిది విశ్వాసం. ఎదురుచూసేవి మారవచ్చు, మారకపోవచ్చు. ఇది నిరీక్షణ. దీనిని మనం అర్థమయ్యేలా చెప్పాలంటే, రేపు ఉదయం సూర్యుడు ఉదయిస్తాడనేది విశ్వాసం, అంటే సూర్యుడు ఉదయిస్తాడనే విషయంలో ఎంతమాత్రం సందేహం లేని పూర్తి నిశ్చయత. సాయంత్రం వర్షం వస్తుందనేది నిరీక్షణ. కానీ వర్షం రావచ్చు, రాకపోవచ్చు. అందులో నిశ్చయత లేదు. ఇదే నిరీక్షణ. కాబట్టి ఎదురుచూసే వాటిలో ఏ స్థితిలోనైనా మార్పులేనిది విశ్వాసం. ఎదురుచూసే వాటిలో ఒకవేళ మారవచ్చు, మారకపోవచ్చు అంటే అది నిరీక్షణ. ఇదే విశ్వాసానికి, నిరీక్షణకు ఉన్న వ్యత్యాసం.

## సాధారణ ఉపదేశ ఆధారిత విశ్వాసం

సాధారణంగా ప్రతి మతంలోనూ వారి బోధల ఆధారంగా అనేక విశ్వాసాలు ఉన్నాయి. ఇందులో క్రైస్తవులు కూడా ఉపదేశాల ఆధారంగా విశ్వాసం గలవారుగా ఉన్నారు. దేవుడు లేడని చెప్పే వారికి కూడా దేవుడు లేడనే విశ్వాసం. ఇలా అనేక రకాల విశ్వాసాలు ప్రజలందరి దైనందిన జీవితంలో ఉండటాన్ని మనం చూస్తున్నాం. అయితే ఈ విశ్వాసం అనేది నిజమా? అని చూసినప్పుడు, ఇవన్నీ నకిలీ విశ్వాసాలుగా ఉన్నాయి.

అలాంటప్పుడు నిజమైన విశ్వాసం ఏది అంటే, **యోహాను 17:17** ప్రకారం "నీ వాక్యమే సత్యము." దేవుని ద్వారా ఇవ్వబడిన వాక్యం మాత్రమే సత్యమై ఉన్నది. అది ఎలా సత్యమై ఉన్నదంటే, ఆయన వాక్యం అబద్ధమాడదు. అబద్ధమాడడానికి ఆయన మానవుడు కాదు, పశ్చాత్తాప్పడడానికి ఆయన నరుడు కాదు **(సంఖ్యాకాండము 23:19).** కాబట్టి ప్రభువు వాక్యం మాత్రమే సత్యం. మిగిలినవన్నీ వ్యర్థం. దీనిని గురించే

ప్రసంగి 1:2 లో వ్యర్థం వ్యర్థం అంతా వ్యర్థం అని చెప్పబడింది.

## అతి పరిశుద్ధ విశ్వాసం అంటే ఏమిటి?

**యూదా 1 : 20**

**ప్రియులారా, మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు, పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచు,**

దేవుడు తన పిల్లలతో ప్రియులారా, మీ అతి పరిశుద్ధమైన విశ్వాసం మీద స్థిరపడండి అని చెబుతున్నాడు. ఇక్కడ అతి పరిశుద్ధమైన విశ్వాసం అని పేర్కొనబడటాన్ని మనం చూస్తున్నాం. దీని గురించి మనం ఎప్పుడైనా విన్నామా? ఇక్కడ చెప్పబడిన అతి పరిశుద్ధమైన విశ్వాసం అనేది దేనిని సూచిస్తుంది అంటే, సత్య వేద వాక్య ఆధారంగా వచ్చేదే అతి పరిశుద్ధమైన విశ్వాసం అని మనం చూస్తున్నాం. మిగిలినవి సాధారణ విశ్వాసాలు.

**విశ్వాసం - అతి పరిశుద్ధ విశ్వాసం వీటి వ్యత్యాసాలు:** విశ్వాసం అనేది లోకపు మానవ బోధల ద్వారా వచ్చేది. అతి పరిశుద్ధ విశ్వాసం అనేది దేవుని ద్వారా ఇవ్వబడిన సత్య వాక్యం ద్వారా మాత్రమే వచ్చేది. కాబట్టి నిజమైన క్రైస్తవుడు సత్యం ద్వారా వచ్చే అతి పరిశుద్ధమైన విశ్వాసంలో తన్ను తాను స్థిరపరచుకోవాలి.

## సత్యవాక్యం ఎలా వచ్చింది?

**హెబ్రీయులకు 1 : 1 – 2**

**1 పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు**
**2 ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను.**

## ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను.

దేవుని వాక్యం పూర్వకాలంలో వివిధ సమయాల్లో, వివిధ రీతులుగా ప్రవక్తల ద్వారా దేవుడు మాట్లాడాడు. ఈ చివరి రోజుల్లో యేసుక్రీస్తు ద్వారా ఈ సత్యవాక్యం వచ్చింది. దీని గురించి **యోహాను 1:17** లో ధర్మశాస్త్రం మోషే ద్వారా ఇవ్వబడింది; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెనని ఉంది. ఈ సత్య వాక్యాలు యేసుక్రీస్తు ద్వారా రావడానికి ముందు దేవుడు తాను ఎన్నుకున్న పిల్లలకు స్వప్నాల ద్వారా, దర్శనాల ద్వారా, ప్రవచనాల ద్వారా తన చిత్తాన్ని బయలుపరుస్తూ వచ్చాడు. ఈ విధంగా సత్య వాక్యం వచ్చింది.

## సత్యాన్ని అర్థం చేసుకోవడం ఎలా?

### యోహాను 16 : 13

**అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును.**

యేసు తన మొదటి రాకడలో వచ్చిన తర్వాత, తన శిష్యులకు వాక్యాన్ని బోధిస్తూ వచ్చాడు. శిష్యులకు అర్థం కాని అనేక ఉపమానాలను యేసు, వారు అర్థం చేసుకునేలా చెప్పాడు. ఈ విధంగా 3 ½ సంవత్సరాలు యేసు శిష్యులకు బోధించి, తాను సిలువపై మరణించి పునరుత్థానమైన తర్వాత, తాను సజీవుడనని చూపించుకున్నాడు. యేసు చెప్పిన వాటిని శిష్యులు సరిగ్గా అర్థం చేసుకోలేదు. కానీ యేసు పరలోకానికి వెళ్ళిన తర్వాత, పరిశుద్ధాత్మ ఇవ్వబడింది. దాని ద్వారా సత్యాన్ని అర్థం చేసుకునేలా చేసి, శిష్యులను సర్వ సత్యంలోకి నడిపించాడు. ఈ పరిశుద్ధాత్మ తనంతట తాను

మాట్లాడకుండా, తాను వినిన దానిని చెప్పి, రాబోయే దానిని తెలియజేస్తుంది. ఈ విధంగా అపొస్తలులు యేసు పరిచర్య చేసిన రోజుల్లో ఎరుగని సత్యాన్ని పరిశుద్ధాత్మను పొందిన తర్వాత తెలుసుకున్నారు. కాబట్టి అపొస్తలుల విశ్వాసం అతి పరిశుద్ధమైన విశ్వాసం. అది ఎలాగంటే సత్య వాక్యాన్ని యేసు నుండి నేరుగా పొందుకున్నారు, ఇలా పొందుకున్న సత్య వాక్యాన్ని పరిశుద్ధాత్మ ద్వారా అర్థం చేసుకునేలా చేశాడు. పరిశుద్ధాత్మ లేకుండా దేవుని సత్యాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. కాబట్టి సత్యాన్ని అర్థం చేసుకునేలా చేసింది పరిశుద్ధాత్మే.

## ఒక్కసారే అప్పగించబడిన విశ్వాసం

**యోహాను 1 : 17**

**ధర్మశాస్త్రము మోషే ద్వారా అను గ్రహింపబడెను; కృపయు సత్యమును యేసు క్రీస్తు ద్వారా కలిగెను.**

**యూదా 1 : 3**

**ప్రియులారా, .... పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసివచ్చెను.**

అతి పరిశుద్ధమైన విశ్వాసం అనేది కృప మరియు సత్యం అని పేర్కొనబడింది. కృప అంటే, "అర్హత లేని వారికి దొరికే బహుమానం" కృప అనబడుతుంది. సత్యం అంటే "ప్రభువు వాక్యమే సత్యం" అనబడుతుంది. సత్యం కృపగా యేసు ద్వారా మనకు లభించింది. ఈ సత్య వాక్యాల ద్వారా పరిశుద్ధులకు విశ్వాసం యేసుక్రీస్తు ద్వారా ఒక్కసారే అప్పగించబడింది. ఈ విశ్వాసం కోసం పోరాడాలి. ఈ విశ్వాస వాక్యాలను దేవుని ద్వారా పంపబడిన యేసు మాట్లాడాడు. ఆయనకు దేవుడు తన ఆత్మను కొలత లేకుండా ఇచ్చాడు **(యోహాను 3:34)**.

## విశ్వాసం ఎలా వస్తుంది?

### రోమీయులకు 10 : 17

**కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును.**

విశ్వాసం దేవుని ద్వారా పంపబడిన యేసు మాట్లాడిన సత్యాన్ని వినడం ద్వారా వస్తుంది. ఆ సత్యం యేసుక్రీస్తు ద్వారా లోకంలో వెల్లడైంది. యేసు మాట్లాడిన మాటలు దేవునివే అని స్పష్టంగా తెలుస్తోంది. కాబట్టి, విశ్వాసం యేసుక్రీస్తు ద్వారా మాట్లాడబడిన సత్యాన్ని వినడం ద్వారా వస్తుంది. ఈ విశ్వాసమే అతి పరిశుద్ధమైన విశ్వాసం. కాబట్టి, ఈ అతి పరిశుద్ధమైన విశ్వాసంలో స్థిరత్వం కలిగిన వారిగా ఉందాము అంటే మనం క్రమక్రమంగా సత్యాన్ని ఎరిగే జ్ఞానంలోనూ, క్రీస్తుపై ఉంచే విశ్వాసంలోనూ ఎదగడానికి, బైబిల్ నేర్చుకోవడం మరియు వాక్యాన్ని ఎరిగే జ్ఞానాన్ని పొందడం నిరంతర ప్రక్రియ. దీనిని ఎంతో ఓపికతో మనం కొనసాగించాలి. ఇదే మనం విశ్వాసంలో స్థిరపడటం. దీని గురించి మన ప్రభువు కూడా మనకు ఇస్తున్న వాగ్దానం ఏమిటంటే, **యోహాను 8:32** లో "సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని...." ఈ సత్యం అనే దేవుని వాక్యాలు, పొరపాట్ల నుండి, మూఢనమ్మకాల నుండి, తప్పుడు బోధల నుండి మనల్ని విడుదల చేస్తాయి. కానీ మానవుల బోధల ద్వారా ఏర్పడిన సాధారణ విశ్వాసం, ప్రజలను మోసం చేసి చిక్కుల్లో పడేసేదిగా ఉంది. కాబట్టి మనం దేవుని వాక్యాలను, సత్యం ద్వారా ఏర్పడిన అతి పరిశుద్ధమైన విశ్వాసం మీద స్థిరపరచుకుందాం, సత్యాన్ని వినడం ద్వారా ఆ విశ్వాసం వస్తుంది.

## పరిశుద్ధ గ్రంథం ఇవ్వబడిన ఉద్దేశ్యం

### 2 తిమోతి 3 : 16, 17

**16 దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును,**

**17 ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది.**

పరిశుద్ధ గ్రంధ వాక్యాలన్నీ దేవుని ఆత్మ ద్వారా వ్రాయబడ్డాయి. దైవజనుడు సన్నద్ధుడై సత్కార్యం చేయడానికి ఉపదేశం, ఖండించడం, తప్పు దిద్దడం, నీతిని నేర్పించడం కోసం పరిశుద్ధ గ్రంధం ఇవ్వబడింది. "**సన్నద్ధుడై**" అనేది, వాక్యాన్ని నేర్చుకునే వారు సిద్ధపడిన వారుగాను, వాక్యాన్ని బోధించే నైపుణ్యం పొందిన వారుగాను ఉండటానికి ఈ వాక్యం సహాయపడుతుంది. "**సత్కార్యమునకు**" అనేది, ఈ లోకంలో చేసే సత్కార్యాలను సూచించదు. సత్కార్యం అంటే దేవుని చిత్తాన్ని ఎరిగి దాని ప్రకారం నడుచుకోవడమే సత్కార్యం. ఈ సత్కార్యం చేయడానికి కూడా పరిశుద్ధ గ్రంధం సిద్ధపరుస్తుంది. "**ఉపదేశమునకు**" అనేది, సర్వ సత్యాలను వాటి పాఠాలను బైబిల్లో ఉన్నట్లుగా నేర్చుకోవడానికి, నేర్చుకున్న దానిని బోధించడానికి మరియు బోధనలలోని నకిలీలను గుర్తించడానికి సహాయపడుతుంది. "**ఖండించుటకు**" అనేది, తప్పుడు నమ్మకాలను మరియు పొరపాట్లను వాక్య వెలుగు ద్వారా ఎత్తిచూపి, విరుద్ధమైన బోధలను, ఉపదేశాలను వేలెత్తి చూపేదిగాను, ఖండించి బుద్ధి చెప్పేదిగాను సత్యవాక్యం ఉంది. "**తప్పు దిద్దుటకు**" అనేది, సత్యం ప్రకారం నిజమైన ఉపదేశాల ఆధారంగా సరిదిద్దవలసిన వాటిని సరిదిద్దేదిగా ఉంది. "**నీతియందు శిక్ష చేయుటకు**" అనేది, దేవుని ద్వారా అంగీకరించబడిన ఒక సరైన మార్గదర్శిగా మన జీవిత ప్రవర్తనలకు, జీవనానికి ఉపయోగకరంగా ఉంది. దేవుని ఆత్మ ద్వారా ఇవ్వబడిన పరిశుద్ధ గ్రంధం లో ఆధ్యాత్మిక మానవునికి అవసరమైన అన్ని ఉపదేశాలు, సరిదిద్దడానికి అనువైనవి,

ఖండించడానికి తగినవి, నీతిని నేర్పించేవి, సత్కార్యం చేసేవన్నీ వాక్యంలో సిద్ధపడే వారికి ఇవ్వబడ్డాయి. వీటిలో ఏదీ తక్కువ లేదు. వీటిలో ఏదీ జోడి లేకుండా లేదు **(యెషయా 34:16)**. ఇలా సమస్తాన్ని దేవుని ఆత్మ ద్వారా వేదంలో ఇచ్చినందున, దీనికి మించిన ఏ ఉపదేశమైనా, బోధనలైనా చెప్పబడినట్లయితే, అవి అతి పరిశుద్ధమైన విశ్వాస ఆధారంగా వచ్చినవి కావు. అది మానవ బోధల ద్వారా వచ్చినదే. దైవజనుడిని సన్నద్ధుడిని చేయడానికే పరిశుద్ధ గ్రంథం ఇవ్వబడింది.

## విశ్వాసం నుండి తొలగిపోయేలా చేసింది ఎవరు?

### 2 కొరింథీయులకు 11 : 3

**సర్పము తన కుయుక్తి చేత హవ్వను మోసపరచినట్లు మీ మనస్సులును చెరుపబడి, క్రీస్తు ఎడలనున్న సరళత నుండియు పవిత్రత నుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడుచున్నాను.**

అతి పరిశుద్ధమైన విశ్వాసం నుండి దారి తప్పిపోవడం సంఘంలో ఎలా సంభవించింది అనే దాని గురించి, మనం వేదంలోని ఒక ప్రవచనాన్ని చదివి దీనికి సమాధానాలను వెతుకుదాం. అపొస్తలుడైన పౌలు, సాతాను మొదటి హవ్వను ఏదెనులో మోసగించినట్లు, క్రీస్తును గురించిన సత్యం నుండి రెండో హవ్వ అయిన సంఘాన్ని కూడా మోసగిస్తాడేమోనని భయపడుతున్నాడు. ఇక్కడ సంఘాన్ని హవ్వతో ఎందుకు పోల్చాలి అని ఆశ్చర్యపోవచ్చు. మనకు తెలిసినట్లుగా ఆదాము, హవ్వల ద్వారా నేటి మానవాళి అంతా విస్తరించినట్లుగానే, వీరిని మరణంలోనికి కూడా అనుమతించబడింది. **రోమీయులకు 5:12** ప్రకారం "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున

మరణము అందరికిని సంప్రాప్తమాయెను." ఆ విధంగా ఆదాము ద్వారా పాపంలోకంలో అందరిలోకి విస్తరించినట్లుగా, క్రీస్తు విధేయత ద్వారా అందరికీ జీవం లభిస్తుంది. దీని గురించి **1 కొరింథీయులకు 15:45** లో "ఇందు విషయమై ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను." మొదటి ఆదాము, కడపటి ఆదాము అయిన యేసుకు నీడ. అదే విధంగా మొదటి హవ్వ కూడా ఈ రెండో హవ్వ అయిన సంఘానికి పోల్చబడింది. యేసు కూడా ఒక వధువును కలిగి ఉన్నాడు. క్రీస్తు సంఘమే ఆ రెండో హవ్వ. ఆనాడు సాతాను హవ్వను ఏదెనులో మోసగించినట్లు, నేడు కూడా రెండో హవ్వ అయిన సంఘాన్ని సాతాను అబద్ధ బోధల ద్వారా మోసగిస్తాడేమోనని పౌలు భయపడుతున్నాడు. రెండో హవ్వ అయిన ఆదిమ సంఘాన్ని సాతాను ఏ విధంగా మోసగించాడో చూద్దాం.

## ➡ రెండో హవ్వను మోసగించిన విధానం

### గలతీయులకు 3 : 1

### ఓ అవివేకులైన గలతీయులారా, మిమ్మును ఎవడు భ్రమపెట్టెను?....

ఇక్కడ అపొస్తలుడైన పౌలు గలతీ సంఘాన్ని ఖండించి, అవివేకులైన గలతీయులారా! సత్యానికి లోబడకుండా పోయేంతగా మిమ్మల్ని మాయాజాలంలో ముంచినవాడెవడు? అని ప్రశ్న అడగటాన్ని మనం చూస్తున్నాం. వారు యూదుల చట్ట నిబంధనల విషయంలో ఎంతో గందరగోళంలో ఉన్నారు. ఇది ఆదింఅ సంఘంలో ఒక సమస్యగానే ఉండినది. ఆదింఅ సంఘంలో అందరూ యూద మార్గం నుండి వచ్చినవారు. వారు యూదులుగా ఉన్నప్పుడు చాలా కఠినమైన అన్ని చట్ట నిబంధనలను అక్షరాలా పాటించారు. కానీ, యేసు ధర్మశాస్త్రానికి ముగింపుగా ఉండి, అన్నిటినీ నెరవేర్చినందున, నేడు ధర్మశాస్త్రం కొట్టివేయబడింది.

కొట్టివేయబడిన ధర్మశాస్త్రాన్ని, చట్ట నిబంధనలను పాటించాలని వీరిని, యూదులు కొట్టివేయబడిన బోధల ద్వారా సత్యానికి లోబడకుండా చేశారు. ఈ విధంగా యేసు ద్వారా ఇవ్వబడిన సత్యాన్ని విడిచి దారి తప్పేలా చేయడానికి ధర్మశాస్త్ర బోధకులు బోధించారు. ఏమని వారు బోధించారో ఇప్పుడు చూద్దాం.

## సున్నతి పొందాలని బోధించుట

### అపొస్తలుల కార్యములు 15 : 1

**కొందరు యూదయ నుండి వచ్చి మీరు మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనే గాని రక్షణ పొందలేరని సహోదరులకు బోధించిరి.**

యూదయ నుండి వచ్చిన యూదులు మోషే పద్ధతి ప్రకారం సున్నతి పొందకపోతే రక్షణ పొందలేరని, ఒక యూద క్రైస్తవుడు ధర్మశాస్త్ర చట్ట నిబంధనలకు లోబడి ఉండాలని ఆదిమ అన్యుల సంఘంలో బోధించడం ప్రారంభించారు. ఇక్కడ కూడా క్రైస్తవులుగా మారిన వారి మధ్య ధర్మశాస్త్ర చట్ట నిబంధనలను పాటించాలా? వద్దా? అనే విషయంలో గందరగోళం ఏర్పడటాన్ని చూస్తున్నాం. పైగా సాతాను వారిని మరింత గందరగోళ పరచడానికి మార్గం వెతికాడు. కొట్టివేయబడిన ధర్మశాస్త్ర బోధలు మరియు అతని క్రియలు అపొస్తలుల రోజుల్లోనే ప్రారంభమయ్యాయి అంటే, ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంటుందో? కొంచెం ఆలోచించి చూద్దాం. ఇంకా ఆదిమ సంఘంలో అతను కలిగించిన మరో వంచన మృతులు పునరుత్థానం లేదని మరియు మానవ కల్పిత సంప్రదాయాలను బోధించారు.

## పునరుత్థానం లేదనే బోధ

### 1 కొరింథీయులకు 15 : 12

## క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడని ప్రకటింపబడు చుండగా మీలో కొందరు మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పుచున్నారు?

సద్దూకయ్యులు పునరుత్థానం లేదని ప్రకటించారు. ఇక్కడ పునరుత్థానం గురించిన సందేహాలను సాతాను వారి మధ్య తలెత్తేలా చేయడాన్ని మనం చూస్తున్నాం. క్రీస్తు మృతులలో నుండి లేచి ఉండగా, మృతులు పునరుత్థానం చెందరని చెప్పి, యేసు పునరుత్థానం చెందాడు అనే సువార్త లేదని నిరూపించడానికి ప్రయత్నం చేశాడు. ఇవన్నీ మనుషుల ద్వారా పుట్టిన అబద్ధ ఉపదేశాలు. ఈ విధంగా వంచనలను గురించి మరియు వంచించే వారి గురించి మన ప్రభువైన యేసు మరియు అపొస్తలుడైన పౌలు మనల్ని హెచ్చరించారు.

## పూర్వీకుల సంప్రదాయ బోధలు

### మత్తయి 15 : 2 – 3

**2 నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారే, వారెందు నిమిత్తము పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించు చున్నారని అడిగిరి**

**3 అందుకాయన మీరును మీ పారం పర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు?**

శాస్త్రులు మరియు పరిసయ్యులు పూర్వీకుల సంప్రదాయాలను పాటించాలని యేసును ఒత్తిడి చేశారు. దానికి యేసు మీ సంప్రదాయాల వల్ల దేవుని ఆజ్ఞలు అతిక్రమించబడుతున్నాయని హెచ్చరించాడు. ఇటువంటి పూర్వీకుల సంప్రదాయ బోధల వల్ల దేవుని ఆజ్ఞ నిరర్థకం చేయబడి, సత్యం ద్వారా ఏర్పడిన అతి పరిశుద్ధమైన విశ్వాసాన్ని కోల్పోయారు.

ఈ పూర్వీకుల సంప్రదాయ ఉపదేశమే మానవ బోధ.

## సంఘానికి పౌలు ఇచ్చిన హెచ్చరిక

### అపొస్తలుల కార్యములు 20 : 29, 30

**29 నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించుననని నాకు తెలియును; వారు మందను కనికరింపరు.**

**30 మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు.**

ఇక్కడ అపొస్తలుడైన పౌలు, నా మరణం తర్వాత తోడేళ్లలా తలెత్తే అబద్ధ ప్రవక్తలు సంఘాన్ని చెడగొడతారని హెచ్చరిస్తున్నాడు. ఎలాంటి వారిని వంచిస్తారంటే, అతి పరిశుద్ధమైన విశ్వాసంలో ఉన్న నిజమైన శిష్యులను కూడా తమ వైపు లాక్కునేంతగా విపరీతమైన సంగతులు బోధిస్తారని చెబుతున్నాడు. దీని గురించి మన ప్రభువైన యేసు ఎంతో కాలం క్రితమే హెచ్చరించాడు.

## యేసు చెప్పిన హెచ్చరిక

### మత్తయి 7 : 15

**అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు.**

యేసు అతి పరిశుద్ధమైన విశ్వాసం నుండి తొలగించే అబద్ధ ప్రవక్తల పట్ల జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. వారు గొర్రె చర్మం ధరించిన, లోపల క్రూరమైన తోడేళ్లు అని చెప్పాడు. దీని అర్థం ఏమిటంటే, ఇక్కడ చెప్పబడిన గొర్రె చర్మం అనేది పైకి కనిపించే వేషధారణలో కూడిన ప్రేమ, దయ, మృదువైన మాటలు. బాహ్య రూపం గొర్రె. కానీ **అంతరంగం తోడేలు ఎలా గొర్రెను చంపి తినే**

**ఉద్దేశంతో ఉంటుందో, అలాగే వారి అంతరంగం కూడా స్వార్థపూరిత లాభాన్ని ఆశించి సంఘాన్ని చెడగొట్టే ఉద్దేశంతో ఉంటుంది.** ఈ ప్రవచన వాక్యం అబద్ధ ప్రవక్తల లక్షణాలను ఎత్తిచూపుతుంది. ఈ వాక్య ఆధారంగా తర్వాతి ప్రశ్న తలెత్తుతుంది. నిజానికి ప్రవక్త అంటే ఎవరు? మరియు ప్రవచనం అంటే ఏమిటి? నేడు ఉన్న సంఘాల్లో ప్రవచనం అంటే దైనందిన సమస్యల గురించి, ఇతర వ్యక్తిగత అవసరాల గురించి, ఆర్థిక విషయాల గురించి ముందుగా తెలియజేయడం అని అనుకుంటున్నారు. కానీ, అవి ప్రవచనాలు కావు. అవి మానవ మనస్సులో పుట్టిన భావాలే **(యెహెజ్కేలు 13:3, 6, 7, 8).**

## నిజమైన ప్రవచనం ఏది?

### ప్రకటన 19 : 10

**.... యేసును గూర్చిన సాక్ష్యము ప్రవచన సారమని నాతో చెప్పెను.**

"యేసును గూర్చిన సాక్ష్యం" మాత్రమే "ప్రవచన సారము/ఆత్మ" అని చెప్పబడింది. యేసుక్రీస్తు గురించిన సమస్తం బైబిల్లో ఆనవాళ్లతోను, ఉపమానాలతోను మూసివేయబడి ఉంది. కాబట్టి, బైబిల్ ను మరియు అందులోని వాక్యాలను వివరించడమే యేసుక్రీస్తు గురించిన నిజమైన ప్రవచనం. పైగా యేసును గూర్చిన సాక్ష్యం అంటే మనం చెప్పే సాక్ష్యాలైన మానవ సాక్ష్యాలు కాదు. **సాక్ష్యం అంటే వాక్యంలో దాగివున్న క్రీస్తును గురించిన సత్యమైన సందేశమే సాక్ష్యం.** ఇక్కడ యేసు అబద్ధ బోధకుల గురించి మనకు హెచ్చరిక ఇస్తున్నాడు. వారు బాహ్యంగా మాయా ప్రేమను, దయను చూపిస్తూ స్వార్థ లాభాలను ఆశించి మంద యొక్క ఆధ్యాత్మిక జీవితాన్ని చెడగొట్టే వారుగా ఉంటారు. ఇలాంటి అబద్ధ బోధకుల గురించి అపొస్తలుడైన యోహాను కూడా తన పత్రికలో వ్రాశాడు. కాబట్టి, నిజమైన ప్రవచనం అంటే క్రీస్తును గురించిన బోధే.

## అన్ని ఆత్మలను నమ్మకూడదు

**1 యోహాను 4 : 1**

**ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకము లోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి.**

ఇక్కడ యోహాను "ప్రతి ఆత్మను నమ్మకండి" అని హెచ్చరిస్తున్నాడు. అవి దేవుని వల్ల కలిగినవో కావో పరీక్షించండి అనడంలో అర్థం ఏమిటి? ఆత్మలు అంటే లోకం అనుకునే విధంగా రాత్రి వేళల్లో స్మశానాల్లో తిరిగే ఆత్మలా? లేదా చనిపోయిన మనుషుల ఆత్మలా? వాటి గురించి ఇక్కడ యోహాను చెప్పడం లేదు. ఈ ఆత్మల గురించి ఇప్పుడు మనం వాక్యాల ద్వారా కొంచెం పరిశీలిద్దాం.

## ఆత్మ అంటే ఏమిటి?

నేడు ఆత్మల గురించి ప్రజల అభిప్రాయం ప్రకారం, రాత్రి వేళల్లో స్మశానాల్లో తిరిగే అంటే ప్రజలను భయపెట్టే ఆత్మల గురించి ఇక్కడ చెప్పబడుతుందా అంటే, ఖచ్చితంగా కాదు! మీరు ప్రతి ఆత్మను నమ్మకండి అని వాక్యంలో చెప్పబడింది. అంటే ఆత్మను నమ్మమంటున్నాడా? లేదు. ఇక్కడ వాక్యంలో ఉన్నట్లు చెప్పబడిన ఆత్మ అనే పదానికి వేరే అర్థం ఉంది. ప్రాథమికంగా ఆత్మ అంటే కనబడని, అదే సమయంలో శక్తివంతమైన వాటిని సూచిస్తుంది. బైబిల్లో చెప్పబడినట్లుగా ఆత్మ అనే పదానికి ముఖ్యంగా నాలుగు అర్థాలు ఉన్నాయి.

1. జీవ వాయువు అనే ఆత్మ.
2. మానవ మనస్సు/ఆలోచన అనే ఆత్మ.

3. సాతాను అనే ఆత్మ.

4. దేవుని వాక్యం అనే ఆత్మ.

## 1. జీవ వాయువు అనే ఆత్మ

**ప్రసంగి 12 : 7**

**మన్నయి నది వెనుకటి వలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయ చేసిన దేవుని యొద్దకు మరల పోవును.**

ఆత్మ దానిని ఇచ్చిన దేవుని దగ్గరకు వెళ్లే లోపే అంటే జీవ వాయువును సూచిస్తుంది. ఇది సమస్త జీవరాశులను మరియు మానవ శరీరాన్ని పనిచేసేలా చేస్తుంది. ఇది కనబడనిది, శక్తివంతమైనది. ఇది జీవానికి గుర్తింపు. యోహాను చెప్పిన ప్రతి ఆత్మను నమ్మకండి అనేది ఈ జీవ వాయువును ఉద్దేశించినది కాదు.

## 2. మానవ మనస్సు అనే ఆత్మ

**దానియేలు 2 : 1**

**నెబుకద్నెజరు తన యేలుబడియందు రెండవ సంవత్సరమున కలలు కనెను. అందును గురించి ఆయన మనస్సు కలతపడగా ఆయనకు నిద్రపట్టకుండెను**

నెబుకద్నెజరు కన్న కల వల్ల అతని మనస్సు/ఆత్మ కలత చెందిందని చెప్పబడింది. ఇక్కడ ఆత్మ అంటే ఆలోచనలు లేదా జ్ఞాపకాలను సూచిస్తుంది. మానవుని ఆలోచనలు, యోచనలు కనబడనివి మరియు శక్తివంతమైనవి. అయితే మానవుని మనస్సు అనే ఉపదేశం కూడా ఉందని మనం చూస్తున్నాం **(యోబు 15:13; 26:4)**. మానవ ఆలోచనల వల్ల మానవ బోధలు కూడా ఉన్నాయని చూస్తున్నాం.

## 3. సాతాను అనే ఆత్మ

**ఎఫెసీయులకు 2 : 2**

**మీరు వాటిని చేయుచు, వాయు మండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మముచొప్పున మునుపు నడుచుకొంటిరి.**

మూడవ ఆత్మ అనేది సాతాను ఆత్మను సూచిస్తుంది. వాడు క్రియలు చేసేవాడని, వాడు బోధలు చేసేవాడని మనం చూస్తున్నాం. దీని గురించి **1 తిమోతి 4:1** లో వంచించే ఆత్మయైన సాతాను బోధలకు చెవి యొగ్గి, అతి పరిశుద్ధమైన విశ్వాసం నుండి తొలగిపోయే సాతాను ఆత్మ అని చెప్పబడింది.

## 4. దేవుని వాక్యం అనే ఆత్మ

**రోమీయులకు 15 : 18**

**అన్యజనులు విధేయులగునట్లు, వాక్యము చేతను, క్రియ చేతను, గురుతుల బలము చేతను, మహాత్కార్యముల బలము చేతను, పరిశుద్ధాత్మ బలము చేతను....**

**యోహాను 6 : 63**

**....నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి, ...**

దేవుని ఆత్మ బలంతో నిండి ఉంది. ఈ ఆత్మ బలంతో అనేక క్రియలు చేయవచ్చు. ఆ ఆత్మ ద్వారా జ్ఞానాన్ని, వివేకాన్ని, దైవభీతిని, తెలివిని దేవుని ఆత్మ ద్వారా తన వారికి ఇవ్వబడుతుంది **(యెషయా 11:2)**. అయితే **1 యోహాను 4:1** లో చెప్పబడిన ఆత్మ అంటే, **యోహాను 6:63**

ప్రకారం దేవుని ద్వారా ఇవ్వబడిన వాక్యమే ఆత్మ. ఇవి ఉపదేశాన్ని సూచిస్తాయి. కాబట్టి, క్రీస్తు చెప్పిన సత్య వాక్యమే ఆత్మయు జీవమునై ఉంది. ఈ సత్య వాక్యంలో యేసు ఉపదేశం అనే అర్థాన్ని చెబుతున్నాడు. ఇక్కడ ఆత్మ అంటే ఉపదేశాలు లేదా బోధలను సూచిస్తుంది. ఈ విధంగా మనం ప్రతి బోధను నమ్మేయకుండా, అవి మానవుని వల్ల కలిగినవో, సాతాను వల్ల కలిగినవో లేదా దేవుని వల్ల కలిగినవో అని బెరయ పట్టణస్థుల వలె దేవుని వాక్యాల ద్వారా పరీక్షించి చూడమని మనల్ని హెచ్చరిస్తున్నాడు. దేవుని వల్ల కలిగినదైతే మాత్రమే మనం అతి పరిశుద్ధ విశ్వాసంలో నిలిచి ఉండగలం. కాబట్టి, మానవుని మరియు సాతాను బోధలను విడిచి దేవుని సత్య బోధలను అనుసరించాలి. అలా అనుసరించాలంటే వాక్యాన్ని పరిశోధించి చూడాలి.

## ఎందుకు వాక్యాన్ని పరిశోధించాలి?

### అపొస్తలుల కార్యములు 17 : 11

**వీరు థెస్సలొనీకలో ఉన్న వారి కంటె ఘనులైయుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి.**

బెరయ పట్టణస్థులు పౌలు ద్వారా ప్రకటించబడిన బోధలను మనఃపూర్వకంగా అంగీకరించి వాక్యాలను పరిశోధించి చూసినందున సద్గుణవంతులుగా ఉన్నారు. ఆదిమ కాల సంఘంలో బెరయ పట్టణ ప్రజలు సత్యాన్ని వినడంలో చూపించవలసిన శ్రద్ధకు, హెచ్చరికకు వారు చేసిన కృషి మనకు నేటికీ ఒక ఉదాహరణగా ఉంది. అలాగే, నేడు వినే బోధలు దేవుని వల్ల కలిగినవో లేదా మానవ బోధల వల్ల కలిగినవో మరియు సాతాను వల్ల

కలిగినవో అని పరిశోధించి చూసి, దేవుని వల్ల కలిగిన బోధలను అనుసరిస్తే, అతి  పరిశుద్ధమైన విశ్వాసం నుండి తొలగిపోము. ఇందుకోసమే వాక్యాన్ని పరిశోధించాలి.

## వంచించే ఆత్మల ఉపదేశం

**1 తిమోతి 4 : 1 – 4**

**1 అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును**
**2 దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు.**
**3 ఆ అబద్ధికులు, వాత వేయబడిన మనస్సాక్షిగలవారై, వివాహము నిషేధించుచు, సత్యవిషయమై అనుభవజ్ఞానము గల విశ్వాసులు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుచుందురు.**
**4 దేవుడు సృజించిన ప్రతి వస్తువును మంచిది. కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనిన యెడల ఏదియు నిషేధింపతగినది కాదు;**

ఈ మాటలను అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ ద్వారా ప్రేరేపించబడి మొదటి శతాబ్దంలోనే ఉన్నప్పుడే భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను ప్రవచనంగా చెప్పాడు. ఈ సంఘటనలు మూడవ, నాలుగవ శతాబ్దాల్లో, కొందరు క్రైస్తవులు విశ్వాసాన్ని విడిచి వంచించే ఆత్మలను, నయవంచక బోధలైన దయ్యాల ఉపదేశాలను, మూఢనమ్మకాలను, అబద్ధికుల మాయ వల్ల వివాహం చేసుకోకూడదని, మాంసం తినడం తప్పనే బోధలను నమ్ముతూ వచ్చారు. పైగా ప్రభువు మరణించిన వారమైన శుక్రవారాల్లో

మాంసం తినకూడదని వాక్యం అంగీకరించని బోధలు బోధించబడ్డాయి. ఈ విధంగా సంఘం గురించి చెప్పబడిన ప్రవచనాలన్నీ నెరవేరాయి. ఇలాంటి బోధలకు, కట్టుకథలకు మొగ్గు చూపే కాలం వస్తుందని చెప్పిన ఈ ప్రవచన వాక్యం ప్రకారం అన్ని క్రైస్తవ సంస్థలు ఈ తప్పుడు మానవ మరియు సాతాను బోధలకు తమకు తెలియకుండానే చిక్కుకున్నాయి. ఇక్కడ చెప్పబడిన అన్ని సంఘటనలు సంఘం ఎదుగుదలలో నెరవేరాయి. ఇంకా అనేక వాక్యం అంగీకరించని బోధలు బోధించబడుతూ, అంగీకరించబడుతూ ఉండటాన్ని రాబోయే పాఠాలలో చూస్తాము.

## ➡ కట్టుకథలకు మొగ్గు చూపే కాలం

**2 తిమోతి 4 : 2 – 4**

**2 వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయ మందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము.**
**3 ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగు చేసికొని,**
**4 సత్యమునకు చెవినియ్యక కల్పనాకథల వైపునకు తిరుగుకాలము వచ్చును.**

సత్యాన్ని విడిచి కట్టుకథల్లోకి (అబద్ధ బోధలు, అసత్యం) పడిపోయిన కాలంగా ఉన్నందున, అపొస్తలుడైన పౌలు సహోదరులకు సూచిస్తూ, సమయం దొరికినా దొరకకపోయినా దేవుని నిజమైన సేవకులు పరిస్థితులు అనుకూలించినా, అనుకూలించక పోయినా వాక్యాలను బోధించడంలో జాగ్రత్తగా, హెచ్చరికగా ఉండాలని చెబుతున్నాడు. అయితే

వినేవారి పరిస్థితిని బట్టి ఖండించి, గద్దించి, బుద్ధి చెప్పి ఈ సత్యాన్ని మిక్కిలి ఆశతో, ప్రేమతో, సాత్వికంతో బోధించాలి **(ఎఫెసీయులకు 4:15)**. కానీ, వారు ఆరోగ్యకరమైన ఉపదేశాన్ని సహించలేక తమ స్వంత ఇష్టానికి తగ్గ బోధకులను ఎంచుకొని, సత్యానికి చెవి యొగ్గకుండా కట్టుకథలకు మొగ్గు చూపే నకిలీ బోధలతో నిండిన లోకంలో ఉన్నాము. వీటిని బోధించేవారు అబద్ధ ప్రవక్తలు, అబద్ధ బోధకులు. వీరు నాశనకరమైన బోధలను తంత్రముగా బోధించి, తమ్మును కొన్న ప్రభువును నిరాకరిస్తూ, తమకు తామే త్వరగా నాశనాన్ని తెచ్చుకుంటారు. వీరి చెడు నడతలను అనేకమంది అనుసరిస్తారు. వీరు లోభులై తంత్రముగా జనులను తమకు లాభంగా వాడుకుంటారు. వీరి వల్ల సత్యమార్గం దూషించబడుతుంది **(2 పేతురు 2:1-3)**. ఈ విధంగా ఆదిమ కాల సంఘంలో వంచనలు మరియు అతి పరిశుద్ధమైన విశ్వాసాన్ని (వాక్య జ్ఞానాన్ని) విడిచి మానవ బోధలైన కట్టుకథల వైపు మొగ్గు చూపారు.

## కట్టుకథలు సంఘంలో ప్రవేశించిన విధానం

ఆదిమ కాల సంఘం ఐదు ముఖ్యమైన పట్టణాలలో స్థాపించబడింది. అవి ఏవంటే:

1. ఇశ్రాయేలులో ఉన్న యెరూషలేము.
2. గ్రీసులో ఉన్న అంతియొకయ.
3. ఉత్తర ఈజిప్టులో ఉన్న అలెగ్జాండ్రియా.
4. టర్కీలో ఉన్న కాన్స్టాంటినోపుల్.
5. ఇటలీలో ఉన్న రోమా.

ఈ సంఘాలు నెలకొల్పబడి వాటిలో అధ్యక్షులను (సంఘ

పెద్దలు/కాపరులు) సంఘాలను నడిపించే బాధ్యులుగా నియమించారు. ఆ రోజుల్లో రోమ పాలకుల వల్ల సంఘానికి మిక్కిలి శ్రమ కలిగింది. వాక్య ఆధారంగా అధ్యక్షులు సంఘాలలో ముఖ్యమైన బాధ్యతలు కలిగి ఉన్నారు. అన్ని పట్టణాలకు అధ్యక్షులు నియమించబడ్డారు. కాబట్టి సంఘాలకు సంబంధించిన సాధారణ సంఘటనల గురించి మాట్లాడటానికి అధ్యక్షులందరూ సమావేశం కావడం ఆచారంగా ఉండేది. సంఘానికి కలిగిన శోధనలను మనం కలిసికట్టుగా ఎదుర్కోవచ్చు అనే స్వంత ఆలోచన మీద నిర్ణయించుకొని ముఖ్యమైన ఈ 5 సంఘాల అధ్యక్షులు కలిసి పనిచేద్దామని నిర్ణయించుకున్నారు. తర్వాత మనలో ఎవరు నాయకత్వ బాధ్యత తీసుకోవాలి అనే విషయంలో 5 అధ్యక్షుల మధ్య పోటీ ఏర్పడింది. ఈ పోటీ ఫలితంగా ప్రజలను ఆకట్టుకోవడానికి జనులకు అనుగుణంగా అనేక కట్టుకథలు చెప్పి, జనులను తమ వైపు తిప్పుకోవడంలో రోమ్ సంఘానికి చెందిన వారు కట్టుకథలు చెప్పడంలో ఆరితేరిన వారు కావడంతో, ఈ 5 సంఘాలకు సాధారణ అధ్యక్షుడిగా రోమ్ వారు అయ్యారు. ఈ సంఘం 'సాధారణ' అనే అర్థం వచ్చే **Catholic** అనే పేరుతో పనిచేయడం ప్రారంభించింది. పైగా ఈ నాయకత్వం రోమ్లో ఉన్నందున **"Roman Catholic"** (రోమన్ క్యాథలిక్) అని పిలవబడింది. దీని అధ్యక్షులు **Bishop** అని పిలవబడ్డారు. **Bishop** అంటే **Minister** (మంత్రి) అని అర్థం. ఇదే క్రైస్తవుల తల్లి సంఘం అని పిలవబడింది. దాని తర్వాత ఈ అధ్యక్షులకు దేవుడు నివారించిన/నిషేధించిన బిరుదులు ఇవ్వడం ప్రారంభించారు.

## వాక్యం అంగీకరించని బిరుదులు

**మత్తయి 23 : 8 – 10**

**8 మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు.**

**9 మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు.**
**10 మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు.**

యేసు తన పరిచర్య రోజుల్లో మీరు రబ్బీ/బోధకుడు అని పిలవబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీకు బోధకుడు. మీరు అందరూ సహోదరులు. భూమి మీద ఎవరినీ తండ్రి అని పిలవవద్దు. దేవుడు ఒక్కడే మీకు తండ్రి. మీరు గురువులు అని పిలవబడవద్దు. క్రీస్తు ఒక్కడే మీకు గురువు. ఈ విధంగా దేనిని యేసుక్రీస్తు చేయకూడదని చెప్పాడో, వాటన్నిటినీ చేశారు. అది ఎలాగంటే నేడు ఉన్న సేవకులు తమను తాము బిషప్, ఫాదర్, గురువు, రెవరెండ్, మోస్ట్ రెవరెండ్, డాక్టర్ అని పిలిపించుకోవడం ఆచారమైంది. ఈ బిరుదులన్నీ సర్వశక్తిమంతుడైన దేవునికి, క్రీస్తుకు చెందుతాయని మనం చదువుతున్నాం. ఎలాగంటే అండ పిండ బ్రహ్మాండాలను, అనంతమైన అంతరిక్షాన్ని ఆయన సృష్టించాడు. ఆయన సృష్టిని చూడటానికే భయంకరంగా ఉంది. అలాంటప్పుడు వీటి సృష్టికర్తను ఊహించి చూద్దాం. నేడు ఉన్న ఫాదర్లు, బోధకులు, గురువులలో, బిషప్పులలో ఎవరైనా దేవుని వలె ఉండగలరా? లేదా ఆయన బిరుదును ధరించగలరా? మట్టితో చేయబడిన మానవుడు వీటిని ఉపయోగించడానికి దేవుడు అనుమతించలేదు. అపొస్తలుడైన పౌలు మరియు అపొస్తలుడైన యోహాను ఇటువంటి అధ్యక్షులుగా ఉన్నవారే. అయినప్పటికీ వీరికి ఎటువంటి వ్యక్తిగత బిరుదులు లేవు **(ప్రకటన 1:9; ఫిలిప్పీయులకు 1:1)**. మానవుల కంటే కొంచెం ఉన్నత స్థితిలో ఉన్న దూతలకు కూడా ఇటువంటి పేర్లు ఇవ్వబడలేదు. వారు కూడా దేవుని సేవకులే **(ప్రకటన 22:9)**.

## ఎందుకు బిరుదులు పెట్టుకోకూడదు?

### మత్తయి 23 : 8

### .... మీరందరు సహోదరులు.

భూమి మీద ఎవరినీ తండ్రి అని పిలవకూడదని, ఎవరినీ బోధకుడు అని, గురువు అని చెప్పకూడదని చెప్పి ఉండగా, తమను అలా పిలిపించుకునే వారు వాక్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని చూస్తున్నాం. అలాంటప్పుడు బోధించే వారిని, బాధ్యత వహించి నడిపించే వారిని ఎవరు అని పిలవాలని వాక్యం చెబుతుందంటే, మీరు సహోదరులు అని వాక్యం చెబుతోంది. కాబట్టి సహోదరులు బిరుదు, పదవి అనే అధికారంతో మరియు సహోదరుడు సహోదరుడిని ఏలకూడదు. సంఘంలో ఇవ్వబడిన బాధ్యతలను అధికారంగా వాడుకొని సహోదర ప్రేమకు నష్టం కలగకుండా ఉండాలని, ఒకరికొకరు సమానమైన వారు కాబట్టి సహోదరులు అని చెప్పబడింది. కానీ, ఈ సమానమైన వారు నేడు బిరుదులు పెట్టుకొని ఇతర సహోదరులను బానిసలుగా చేసి ఏలుతున్నారు. వీటిని దేవుడు ఎన్నడూ అనుమతించలేదు. సంఘాన్ని నడిపించే బాధ్యత స్వీకరించే వారు ఒక సేవకుడు (పనివాడు) అని **1 తిమోతి 3:1** చెబుతోంది. యేసు పరలోకంలో ఉన్న సర్వశక్తిమంతుడైన దేవుడిని మాత్రమే తండ్రి అని పిలవాలని ఖచ్చితంగా చెబుతున్నాడు. అలాగే యేసు మాత్రమే మనకు బోధకుడుగాను, గురువుగాను ఉన్నాడు. మనం సహోదరులం. కాబట్టి, ఈ బిరుదులను మానవుడు పెట్టుకోకూడదని వాక్యం చెబుతోంది. తప్పుడు మానవ బోధలు మరియు ఈ బిరుదులన్నీ మొదట "రోమన్ క్యాథలిక్" సంఘంలో ప్రారంభమయ్యాయి. కాబట్టి, ఇవి సంఘాలకు తల్లి సంఘం అనబడింది. తర్వాత వారి తప్పులను ఎత్తిచూపి బయటకు వచ్చిన **"Protestant"** సంఘాలలో కూడా ఇవి సంక్రమించాయి. దాని తర్వాత ఈ

రెండు వ్యవస్థలలో తప్పులను ఎత్తిచూపి బయటకు వచ్చిన **"Pentecostal"** సంఘాలలో కూడా ఇవి ఎక్కువగా సంక్రమించాయి. ఈ విధంగా అన్ని సంఘాలు తప్పుడు మానవ బోధలకు మరియు బిరుదులకు బానిసలైపోయాయి.

## క్రీస్తు సంఘానికి శిరస్సు

### ఎఫెసీయులకు 1 : 22, 23

**22 మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను.**
**23 ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపు చున్న వాని సంపూర్ణతయై యున్నది.**

అన్నిటి కంటే పైగా క్రీస్తును దేవుడు సంఘానికి శిరస్సుగా ఇచ్చాడు. దీని ఆధారంగా యేసు సంఘానికి శిరస్సుగా ఉన్నాడని వాక్యం చెబుతోంది. కానీ రోమన్ క్యాథలిక్ సంఘం ఈ వాక్యం గురించి పట్టించుకోకుండా పోప్ను నేటి సంఘానికి నాయకుడు అని చెబుతున్నారు. ఈ వాక్యం ఆధారంగా పోప్ తన్ను తాను సంఘానికి శిరస్సుగా చెప్పుకోవడం తప్పని మరియు పెద్ద అబద్ధమని తెలుస్తోంది. "పోప్" అనే పదం "పప్పా" అనే లాటిన్ పదం నుండి వచ్చింది. దీనికి "తండ్రి" అని అర్థం. పోప్ సంఘానికి శిరస్సుగా ఉన్నాడని రోమ క్యాథలిక్ సంఘస్థుల నమ్మకం, పేతురు మీద సంఘం కట్టబడటం మరియు పరలోక రాజ్యపు తాళపు చెవులు పేతురుకి ఇవ్వబడ్డాయి అనే వాక్యాన్ని తమకు ఆధారంగా తీసుకుంటారు.

## పేతురు మీద సంఘం కట్టబడిందా?

### మత్తయి 16 : 18 – 23

**18 మరియు నీవు పేతురువు3; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను.**
**19 పరలోకరాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను.**
**20 అటు పిమ్మట తాను క్రీస్తు అని యెవనితోను చెప్పవద్దని ఆయన తన శిష్యులకు ఖండితముగా ఆజ్ఞాపించెను.**
**21 అప్పటి నుండి తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దల చేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రుల చేతను అనేక హింసలు పొంది, చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలుపెట్టగా**
**22 పేతురు ఆయన చేయి పట్టుకొని ప్రభువా, అది నీకు దూరమగుగాక, అది నీ కెన్నడును కలుగదని ఆయనను గద్దింపసాగెను.**
**23 అయితే ఆయన పేతురు వైపు తిరిగి సాతానా, నా వెనుకకు పొమ్ము; నీవు నాకు అభ్యంతర కారణమైయున్నావు; నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులను తలంపక యున్నావని పేతురుతో చెప్పెను.**

యేసు పేతురుతో ఈ బండ మీద నా సంఘాన్ని కడతాను అని చెప్పిన వాక్యం యొక్క నిజమైన అర్థం తెలియక, రోమ క్యాథలిక్ సంఘస్తులు ఈ వాక్యాన్ని అపొస్తలుడైన పేతురు సంఘానికి శిరస్సుగా నియమించబడ్డాడని మరియు ఇతనే సంఘం యొక్క "పునాది రాయి" అని

ఉపయోగిస్తున్నారు. ఇది నిజమా? ఈ మాటలు నిజమైతే, కొద్దిసేపటికే క్రీస్తు తాను పడబోయే శ్రమల గురించి చెప్పినప్పుడు, పేతురు ఇవి మీకు రాకూడదని చెప్పి ఆయనను గద్దించినప్పుడు, యేసు పేతురును చూసి, నా వెనుకకు వెళ్ళు సాతానా, నీవు నాకు అభ్యంతరంగా ఉన్నావు. నీవు దేవుని సంగతులను తలచక మానవ సంగతులనే తలచుచున్నావు అన్నాడు. ముందు చెప్పిన మాటలు నిజమైతే సంఘానికి శిరస్సుగా నియమించబడిన పేతురును సాతాను అని ఎందుకు పిలవాలి? ఇది వింతగా, ఆశ్చర్యంగా ఉంది కదా? అలాంటప్పుడు ఈ వాక్యం యొక్క నిజమైన వివరణ ఏమిటి? దీనిని అర్థం చేసుకోవడానికి సంఘటన యొక్క నేపథ్యం చూద్దాం.

## మత్తయి 16 : 13 – 17

**13 యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా 14 వారు కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి.**

**15 అందుకాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను.**

**16 అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. 17 అందుకు యేసు సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు2 నీకు బయలు పరచలేదు.**

ఈ వాక్యానికి ఆధారంగా ఒక ప్రశ్న అడగబడటాన్ని చూస్తున్నాం. "మనుష్య కుమారుడనైన నన్ను ప్రజలు ఎవరు అని చెబుతున్నారు?" అని

అడిగాడు. దానికి వారు నిన్ను ఏలీయా అని, యిర్మీయా అని, ప్రవక్త అని, బాప్తిస్మమిచ్చే యోహాను అని రకరకాలుగా చెప్పారు. కానీ ఈ సమాధానాలు అనేకంగాను, గందరగోళంగాను ఉన్నాయి. తర్వాత యేసు తన శిష్యులను చూసి "మీరైతే నేను ఎవరనని చెప్పుకొనుచున్నారు అని అడిగాడు". ఇక్కడ పేతురు పరిశుద్ధాత్మ బలంతో "నీవు జీవము గల దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని సత్యాన్ని పలికాడు. దీని తర్వాతే యేసు ఈ మాటలు మాట్లాడాడు. **మత్తయి 16:18** "...నేను నీతో చెప్పుచున్నాను, నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దాని ఎదుట నిలువనేరవు." ఇక్కడ పేతురు అనే పేరు **"Petros"** అనే గ్రీకు పదం నుండి తీసుకోబడింది. **Petros** అంటే చిన్న రాయి అని అర్థం. కానీ ఈ బండ మీద అనేది **"Petra"** అనే గ్రీకు పదం. దీనికి పెద్ద బండ/శిల అని అర్థం. ఈ పదాల మధ్య వ్యత్యాసం గ్రీకు భాషలో మాత్రమే ఉంది. కాబట్టి యేసు తన సంఘాన్ని ఈ బండ మీద కడతాను అనేది, పెద్ద రాయి అయిన సత్యాన్ని పునాదిగా చేసుకొని సంఘాన్ని కట్టడం గురించి చెబుతున్నాడు. సత్యమనే పునాది మీద సంఘం కట్టబడటం అంటే, జీవముగల దేవుని కుమారుడైన క్రీస్తు అనే సత్యంలో కట్టబడినదే సంఘం. కాబట్టి, సంఘం పేతురు మీద కట్టబడలేదు.

## సత్యం మీద కట్టబడిన సంఘం

**1 తిమోతి 3 : 15**

**అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో, అనగా జీవము గల దేవుని సంఘములో, జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది.**

సంఘం సత్యమైన క్రీస్తుయేసులో కట్టబడింది. దానికి ఆయనే పునాది రాయిగా ఉన్నాడు. **1 కొరింథీయులకు 3:11** "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసు క్రీస్తే." ఈ పునాది ఇప్పటికే వేయబడింది. దాని మీద మరొకరు ఎవరూ వేయలేరు. ఈ యేసే సత్యమును జీవమునై ఉన్నాడు. ఆయన ద్వారా తప్ప ఎవడూ తండ్రి దగ్గరకు రాలేడు. **యోహాను 14:6** "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు." సత్యమనే పెద్ద రాయితో ఇప్పటికే పునాది వేయబడింది. ఆ రాయి మీద 12 రాళ్లతో పునాది వేయబడింది. వాటిలో ఒకటి పేతురు అనే చిన్న రాయి. పేతురు అనే రాయి మాత్రమే పునాది కాదు. దానితో పాటు మొత్తం 12 రాళ్లు ఉన్నాయి. దీని గురించి **ప్రకటన 21:14** లో "ఆ పట్టణపు ప్రాకారము పండ్రెండు పునాదులు గలది, ఆ పునాదులపైన గొఱ్ఱ పిల్ల యొక్క పన్నిద్దరు అపొస్తలుల పండ్రెండు పేర్లు కనబడుచున్నవి." సంఘం 12 రాళ్ల పునాది అని ఈ వాక్యం చెబుతుండగా, సంఘం పేతురు మీద మాత్రమే కట్టబడింది అనడం మానవ బోధ. కానీ, అతి పరిశుద్ధమైన విశ్వాస సత్యం ఆధారంగా సంఘం యొక్క పునాది క్రీస్తు అనే సత్యం మీద కట్టబడింది. పేతురు మీద కట్టబడలేదు అనేదే సత్యం. ఇప్పుడు మత్తయి సువార్తలో చెప్పబడిన పరలోక రాజ్యపు తాళపు చెవుల అర్థం ఏమిటో చూద్దాం.

## పరలోకపు తాళపు చెవి పేతురు దగ్గరా?

**మత్తయి 16 : 19**

**పరలోకరాజ్యముయొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను.**

పరలోక రాజ్యపు తాళపు చెవిని నీకు ఇస్తాను అనే ఈ వాక్యం అర్థం తెలియక, ఈ వాక్యాన్ని తప్పుడు ఆధారంగా చేసుకొని రోమ క్యాథలిక్ సంఘస్తులు పరలోకపు తాళపు చెవి, పాతాళపు తాళపు చెవి పేతురుకు ఇవ్వబడ్డాయి. ఆ పేతురు ఇప్పుడు పోప్ గా ఉన్నాడు అనే ఆధారంతో పరలోకానికి వెళ్లే అధికారం, నరకంలో పడేసే అధికారం పోప్ దగ్గర ఉందని భావిస్తారు. ఇది నిజమవడానికి అవకాశం ఉందా? "తాళపు చెవి" అనేది **ప్రకటన 1:18** లో "నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములో ఉన్నవి." ఈ వాక్యంలో చెప్పబడిన తాళపు చెవులు అధికారానికి గుర్తుగా ఉన్నాయి. ఈ అధికారం పేతురుకి ఇవ్వబడలేదు. అది యేసు క్రీస్తు దగ్గర ఉంది. దీని గురించి పేతురుకి ఇవ్వబడిన పరలోక రాజ్యపు తాళపు చెవి అంటే, పరలోక రాజ్యంలో అంగమైన సంఘంగా మారబోయే ప్రజలకు మొదటి పిలుపు పేతురు ద్వారా ఇశ్రాయేలీయుల లోపల, ఆ తర్వాత అన్యుల లోపల ప్రారంభించబడింది. కాబట్టి, ఇది గుర్తుగా రాజ్యపు తరగతి కోసం పిలుపును కలిగించే అధికారాన్ని సూచిస్తుంది. ఈ రెండు తరగతులకు పిలుపునందుకొనే అవకాశాన్ని పేతురు కలిగించాడు. పేతురు ద్వారా తెరిచి ఉంచబడిన రెండు తాళపు చెవులు - యూదుల కోసం అవకాశం పెంతెకొస్తు దినాన తెరవబడింది **అపొస్తలుల కార్యములు 2:14-41** (క్రీ.శ. 33). అన్యుల కోసం అవకాశం కొర్నేలి ఇంట్లో తెరవబడింది **అపొస్తలుల కార్యములు 10:19-48** (క్రీ.శ. 3 6 ). ఈ విధంగా పరలోక భాగ్యం పొందే అవకాశం పేతురు ద్వారా ప్రారంభించబడటాన్నే, పరలోక రాజ్యపు తాళపు చెవులను నీకు ఇస్తాను అనడంలోని అర్థం. మన ప్రభువు పరలోక రాజ్యపు నేటి క్రైస్తవ మండలాన్ని గురించిన చరిత్ర గురించి ప్రవచనం చెప్పాడు. వీరి మధ్య నుండి కొందరు

రాజులు, యాజకులు ఎంపిక చేయబడవలసి ఉంది. ఆ ఎంపికను ప్రారంభించే పనిని దేవుడు పేతురు ద్వారా ప్రారంభించాడు. ఇప్పుడు మనం సువార్త యుగం లో జరిగే పరలోక రాజ్య అభివృద్ధి స్థితి గురించి రెండు ఉపమానాల్లో చూడవచ్చు.

## ఆవగింజతో పోల్చబడిన రాజ్యం

**మత్తయి 13 : 31, 32**

**31 ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను పరలోకరాజ్యము, ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది.**

**32 అది విత్తనములన్నిటిలో చిన్నదే గాని పెరిగినప్పుడు కూర మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించు నంత చెట్టగును.**

ఈ ఉపమానం వివరణ ఏమిటి? లేదా ఇది దేనిని సూచిస్తుంది? సంఘం మొదటి శతాబ్దంలో చాలా చిన్నదిగా స్థాపించబడటాన్ని, తర్వాత వచ్చిన శతాబ్దాలలో అసాధారణ అభివృద్ధిని సూచిస్తుంది. ఇప్పుడు మనం ఉపమానం వివరణ చూద్దాం.

- **"ఆవగింజ":** ఆవగింజ ఎంత చిన్నదో అలాగే ఆదిమ సంఘం 12 మంది అపొస్తలులను, కొందరు శిష్యులను తీసుకొని చాలా చిన్న స్థాయిలో స్థాపించబడటాన్ని సూచిస్తుంది.
- **" ఒక మనుష్యుడు తీసికొని":** ఈ రాజ్యపు సువార్త యుగంలో మొదట క్రీస్తు ద్వారా ప్రారంభమై, తర్వాత ఆయన నడిపింపు ప్రకారం పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులు నడిపించిన దానిని సూచిస్తుంది.
- **"తన పొలములో విత్తెను":** పొలం అంటే లోకాన్ని సూచిస్తుంది **(మత్తయి 13:38)**. కాబట్టి, ఈ పూర్తి లోకంలో సువార్త పనులు

జరుగుతూ వచ్చాయని చూపిస్తుంది.

- **"అది పెరిగినప్పుడు":** ఇది సంఘం అభివృద్ధి చెంది, తర్వాత వచ్చిన **300-1000** సంవత్సరాలను సూచిస్తుంది. సాధారణంగా ఆవ మొక్క **2-3** అడుగుల ఎత్తు పెరుగుతుంది. కానీ ఉపమానంలో ఒక పెద్ద చెట్టుగా పెరిగింది. ఇది ప్రకృతికి విరుద్ధమైన అసాధారణ అభివృద్ధిని సూచిస్తుంది. ఇది సంఘం అభివృద్ధి ఉద్దేశం కంటే అసాధారణంగా పెరిగిన దానిని గుర్తిస్తుంది. ఎలాగంటే దేవుడిని, యేసుక్రీస్తును ఎరగని జనులు సౌకర్యాల కోసం క్రైస్తవులుగా మతం మారి రావడం, ఆవగింజ చెట్టుగా పెరగడాన్ని సూచిస్తుంది. ఇవి రోమ చక్రవర్తి "కాన్స్టాంటైన్" రాజు కాలంలో పెరగడం ప్రారంభమైంది.

- **"ఆకాశ పక్షులు":** ఇది ఆకాశమండలపు వాయుమండల అధికారానికి అధిపతియైన అంధకార లోకాధిపతి సేవకులను సూచిస్తుంది **(ఎఫెసీయులకు 2:2)**. వీరు లోక లాభాలను, హోదాలను చెట్టులా పెరిగిన సంఘం మధ్య వెతికే లోక ఆలోచనలు గల సాతాను ప్రతినిధులు. **ప్రకటన 1 8 : 2** ప్రకారం సంఘం అపవిత్ర ఆత్మల నివాసంగా మారిపోయింది.

- **"కొమ్మలయందు నివసించెను":** దేవుడిని, క్రీస్తును గురించి ఎరగని వారు సంఘం యొక్క అధికారాన్ని కలిగి ఉండటాన్నే కొమ్మల్లో నివసించడాన్ని సూచిస్తుంది. వీరు సంఘ వ్యవస్థలో ముఖ్యమైన అధికారాలను, ప్రాముఖ్యతలను పొందారు **1 తిమోతి 4:1-3**. పరలోక రాజ్యం ఆవగింజ వలె చాలా చిన్నదిగానే ఉంటుంది. కానీ అవి ప్రకృతికి విరుద్ధంగా పెద్ద చెట్టు వలె కొమ్మలు వేసి పెరుగుతాయి. ఆ చెట్టు అయిన కొమ్మల్లో సంఘం యొక్క అధికారాలు, ఆకాశ పక్షి అయిన పిశాచి అధికారంలో నడిపించబడి పెద్ద చెట్టుగా పెరుగుతుంది అనేదే ఈ

ఉపమానం యొక్క అర్థం. అతి చిన్నదైన సంఘం పెద్ద చెట్టులా పెరిగి, కొమ్మ అయిన అధికారంలో ఆకాశమండలపు వాయుమండల అధిపతియైన సాతాను ఆధీనంలో సంఘం నడుస్తుంది అనే దానిని యేసు ఇప్పటికే ఉపమానంగా చెప్పాడు. ఈ విధంగా విశ్వాసం కలుషితమైపోయింది. ఇదే నేటి అన్ని సంఘాల పరిస్థితి. యేసు దీని గురించి మరో ఉపమానంలో కూడా చెప్పాడు.

## పులిసిన పిండితో పోల్చబడిన రాజ్యం

**మత్తయి 13 : 33**

**ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను పరలోకరాజ్యము, ఒక స్త్రీ తీసికొని పిండి అంతయు పులిసి పొంగు వరకు మూడు కుంచముల పిండిలో దాచి పెట్టిన పుల్లని పిండిని పోలియున్నది.**

ఈ ఉపమానాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి మొదట మూడు ముఖ్యమైన విషయాలను మనం తెలుసుకోవాలి:

1. పులిసిన పిండి
2. స్త్రీ
3. మూడు తూముల పిండి.

ఇవన్నీ సూచన గా చెప్పబడ్డాయి. ఇప్పుడు మనం ఈ పదాల వివరణలు చూద్దాం.

## పులిసిన పిండి దేనికి గుర్తు?

**మత్తయి 16 : 11 - 12**

**11 నేను రొట్టెలను గూర్చి మీతో చెప్పలేదని మీరెందుకు గ్రహింపరు? పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చియే జాగ్రత్తపడుడని చెప్పెను.**

**12 అప్పుడు రొట్టెల పులిసిన పిండిని గూర్చి కాదు గాని పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి బోధను గూర్చియే జాగ్రత్తపడవలెనని ఆయన తమతో చెప్పెనని వారు గ్రహించిరి.**

ఇక్కడ పరిసయ్యులు, సద్దూకయ్యుల పులిసిన పిండి దేనిని గుర్తిస్తుంది అంటే తప్పుడు మానవ బోధలను సూచిస్తుంది. అవి ఏవంటే - సద్దూకయ్యులు పునరుత్థానం లేదని, దేవదూతయు, ఆత్మయు లేరని చెబుతారు **(అపొస్తలుల కార్యములు 23:8)**. పరిసయ్యులు పూర్వీకుల సంప్రదాయాల వల్ల దేవుని ఆజ్ఞను నిరర్థకం చేశారని **(మత్తయి 15:6)**. కాబట్టి, వాక్యంలో పులిసిన పిండి అంటే పరిసయ్యులు సద్దూకయ్యుల అబద్ధ ఉపదేశాలను సూచిస్తుంది.

## ఒక స్త్రీ దేనికి గుర్తు?

### 2 కొరింథీయులకు 11 : 2

**దేవాసక్తితో మీ యెడల ఆసక్తి కలిగి యున్నాను; ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి, అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని గాని,**

బైబిల్లో స్త్రీ సంఘానికి గుర్తుగా ఉంది. పైగా సంఘం యేసుక్రీస్తుకు నియమించబడిన పవిత్ర కన్యక అని బైబిల్లో చదువుతాము. కానీ ఇక్కడ చెప్పబడిన స్త్రీ మంచి స్త్రీ కాదు. ఆ స్త్రీ ఎవరిని సూచిస్తుంది?

### యెషయా 4 : 1

**ఆ దినమున ఏడుగురు స్త్రీలు ఒక్క పురుషుని పట్టుకొని మేము మా అన్నమే తిందుము మా వస్త్రములే కట్టుకొందుము, నీ పేరు మాత్రము మాకు పెట్టి మా నింద తీసివేయుమని చెప్పుదురు.**

ఆ స్త్రీ ఎవరిని సూచిస్తుంది? నేటి క్రైస్తవ్యం లోని పరిస్థితి ఇది అంటే 7 సంఘ కాలాల లోని క్రైస్తవ్య సంఘం ఒకే పురుషుడైన యేసుక్రీస్తును పేరుకి మాత్రమే క్రైస్తవ్యులమని చెప్పుకుంటాము ఎలాంటి నింద రాకుండా కానీ మా అన్నం మేమే తింటాము అంటే అసలైన దేవుని సత్యం మాకు అవసరం లేదు కానీ మా ఇష్టానుసారమైన బోధనలు చేసుకుంటామని, మా వస్త్రములే అంటే ప్రభువు ఇచ్చే నీతి వస్త్రం వద్దని వారి ఇష్టానుసారమైన వస్త్రములే కట్టుకొంటామని చెప్పటం చూడగలము. ఇదే నకిలీ సంఘం లేదా నామమాత్రపు క్రైస్తవ్యం గా చూడగలము.

## మూడు తూముల పిండి దేనికి గుర్తు?

### 1 కొరింథీయులకు 13 : 13

**కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును; వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే.**

మూడు తూముల పిండి అంటే క్రైస్తవ జీవితానికి మూడు ఆధార స్తంభాలను సూచిస్తుంది. అవి విశ్వాసం, నిరీక్షణ మరియు ప్రేమ. ఈ మూడు క్రైస్తవ మూలాధారాలు వ్యభిచారిణియైన స్త్రీ యొక్క తప్పుడు ఉపదేశాల వల్ల పులిసి పాడైపోయాయి. ఈ సంఘటన ఎలా జరిగిందో ఇప్పుడు చూద్దాం.

- **"విశ్వాసం":** మనుషుల ద్వారా ఏర్పరచబడిన విశ్వాస ప్రమాణాలు, అతి పరిశుద్ధమైన విశ్వాస స్థానాన్ని ఆక్రమించాయి. **యోహాను 14:1** ప్రకారం దేవుని మీద, యేసు మీద ఉంచవలసిన విశ్వాసం లేకుండా పోయింది. వాక్యం చదవడం మానేసి, లోకసంబంధమైన నమ్మకాలు, అబద్ధ ఉపదేశాలు సంఘం యొక్క నిజమైన విశ్వాసంలో, నిరీక్షణలో ప్రవేశించడం ప్రారంభించాయి.

బైబిల్లోని సత్యం క్రమక్రమంగా మరుగైపోయింది. ఈ విధంగా దేవుని మీద, యేసుక్రీస్తు మీద ఉన్న విశ్వాసానికి ద్రోహం జరిగి, విశ్వాసం పులిసిపోయింది.

- **"నిరీక్షణ":** మనకు ఇవ్వబడిన అతిపెద్ద నిరీక్షణ - "సహించిన వారమైతే ఆయనతో కూడ ఏలుదుము." **(2 తిమోతి 2:12).** క్రీస్తును అంగీకరించి, ఆయనతో శ్రమపడితే ఆయనతో పరిపాలించవచ్చు అనే నిరీక్షణ పులిసిపోయి, ఈ శ్రమలను విడిచి లోక ఆశీర్వాదాన్ని కేంద్రంగా చేసుకొని బోధించబడుతోంది. ఈ విధంగా ఆదిమ సంఘంలోనే అధికారం చెలాయించాలని, పరిపాలించాలని ఆశించారు. లోక జీవితంలో గౌరవాన్ని, మహిమను వెతకడం ప్రారంభించారు. క్రీస్తు నిమిత్తం రక్తం చిందించడానికి, హింసించబడటానికి నిరాకరించారు. ప్రస్తుత శ్రమలు రాబోయే కాలపు పరిపాలనకు నిశ్చయత అనే నిరీక్షణ పూర్తిగా తిరస్కరించబడి, సుఖభోగాల జీవితంలో శ్రమల ద్వారా పరిపాలన అనే నిరీక్షణ పులిసిపోయింది.

- **"ప్రేమ":** తండ్రి ప్రేమ, కుమారుని ప్రేమ తగ్గిపోయి, ఈ లోకంలో సహజమైన స్వార్థం సంఘాన్ని పూర్తిగా ఆవరించింది. సంఘ నాయకత్వం సాధారణ ప్రజలను బానిసలుగా చేయడం ప్రారంభించి, సహోదర ప్రేమ కూడా తగ్గిపోయింది. ఈ విధంగా అతి పరిశుద్ధమైన విశ్వాసం పాడైపోయి సంఘంలోని సత్యం, క్రీస్తు బోధలు పూర్తిగా దారి తప్పి దేవుని మీద, క్రీస్తు మీద, సహోదరుల మీద ఉన్న ప్రేమ తగ్గిపోయింది. ఈ విధంగా దేవుని మీద ఆయన కుమారుని మీద ఉంచవలసిన విశ్వాసం, విశ్వాసం నిమిత్తం వచ్చే శ్రమల ద్వారా

రాజ్యంలో ఏలుతాము అనే నిరీక్షణ, సహోదరులుగా ఒకరినొకరు ప్రేమించుకొని ఏకమనస్సుతో ఉండవలసిన దానికి బదులు పదవి, బిరుదు, అధికారం ఇవి తోటి సహోదరుడిని బానిసగా చేసి, సహోదర ప్రేమ తగ్గిపోయి పులిసిపోతుంది అని యేసు ఉపమానంగా చెప్పాడు.

## మానవుల ద్వారా బోధించబడిన కల్పితం

**యెషయా 29 : 13**

**ప్రభువు ఈలాగు సెలవిచ్చియున్నాడు ఈ ప్రజలు నోటిమాటతో నాయొద్దకు వచ్చుచున్నారు పెదవులతో నన్ను ఘనపరచుచున్నారు గాని తమ హృదయమును నాకు దూరము చేసికొని యున్నారు వారు నాయెడల చూపు భయభక్తులు మానవుల విధులను బట్టి వారు నేర్చుకొనినవి.**

తండ్రి అయిన దేవుడిని యేసుక్రీస్తును విశ్వసించి, దాని నిమిత్తం వచ్చే శ్రమల ద్వారా లోకాన్ని జయించి ఏలేవారిగా మారుతాము అని నమ్మి, ఒకరికొకరు దైవభీతితో ప్రేమించుకొని, ప్రేమస్వరూపియైన దేవుడు మనపై చూపే ప్రేమ నిమిత్తం ఆయనకు భయపడాలి. కానీ, అవన్నీ పులిసిపోయి మానవ కల్పితాలైన విశ్వాస ప్రమాణాలు, అబద్ధ బోధలు ప్రేమస్వరూపియైన దేవుడిని ఒక క్రూరమైన దేవుడిగానే చిత్రీకరిస్తున్నాయి. పైగా లోతైన అర్థాలు గల పాటలు కూడా హృదయ లోతుల్లో నుండి పాడకుండా పెదవుల వరకు పాడుతున్నారు. ఎలాగంటే ఏవి చేయకూడదో అవి చేసి, ఏవి పాటించాలో అవి విడిచిపెట్టడం ద్వారా తాము మాట్లాడేది ఏమిటో, సాధించేది ఏమిటో తెలియకుండా ఉన్నారు. నేటి క్రైస్తవుల పరిస్థితిని ఈ ప్రవచన వాక్యం ఎత్తి చూపుతుంది.

ఈ ప్రవచనాలన్నీ నేటి రోజుల్లో నెరవేరుతున్నాయి. ఎలాగంటే

ప్రజలందరూ తమ నోటితో ఆయన దగ్గరకు చేరి పెదవులతో ఘనపరుస్తున్నారు. కానీ వారి హృదయం ప్రభువుకు దూరంగా ఉంది. వీరు ప్రభువుకు భయపడే భయం మానవుడి ద్వారా బోధించబడిన మానవుని కల్పితంగా ఉంది. ఈ విధంగా సత్యాన్ని దాని ప్రతిబింబాన్ని వెల్లడించకుండా మానవుని బోధల ఆధారంగా పూర్తి సంఘాలు కనిపిస్తున్నాయి

## ఇవి ఎప్పుడు సంభవిస్తాయి?

**మత్తయి 24 : 3, 24**

**3 ఆయన ఒలీవల కొండ మీద కూర్చుండియున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతముగా వచ్చిఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనగా**

**24 అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు.**

శిష్యులు యేసు వద్దకు వచ్చి ప్రభువా ఇవి ఎప్పుడు సంభవిస్తాయి? నీ రాకడకు, లోక సమాప్తికి సూచనలేమిటి అని అడిగినప్పుడు అబద్ధ ప్రవక్తలు, అబద్ధ క్రీస్తులు లేచి సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని కూడా మోసగించేలా గొప్ప సూచనలు, అద్భుతాలు చేస్తారని యేసు చెప్పాడు. ఇవి ఇప్పుడు జరిగే కాలంగా ఉంది. ఎలాగంటే క్రీస్తు పేరుతో అనేక నకిలీ ఉపదేశాలు, నకిలీ అద్భుతాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీరు ఆరోగ్యకరమైన ఉపదేశాన్ని సహించలేని వారై తమకు తగిన బోధకులను ఎంచుకొని సత్యాన్ని విడిచి కట్టుకథల వైపు మొగ్గు చూపే వారుగా ఉన్నారు **(2 తిమోతి 4:3-4)**. యేసుక్రీస్తు ద్వారా, అపొస్తలుల ద్వారా ఇవ్వబడిన

ఉపదేశానికి విరుద్ధంగా పనిచేసి, ఆరోగ్యకరమైన అతి పరిశుద్ధమైన విశ్వాస సత్యపు ఉపదేశాన్ని మార్చి, తమకు తగిన మానవ బోధలను పాటించే వారిగా మారి, దానిని బోధించే వారిని నేడు పెద్ద సంఖ్యలో పోగుచేసుకుంటున్నారు. ఇవి సంఘంలో సుమారు నాలుగవ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. ఈ తప్పుడు బోధ ఏమిటో అంత్యక్రీస్తు అనే పాఠంలో వివరంగా చూడవచ్చు. ప్రేమస్వరూపియైన దేవుడిని క్రూరంగా భావించే చివరి రోజుల్లో మనం ఉన్నాము. వీరిని మనం గుర్తించాలంటే మనం చిన్న పిల్లల్లా ఉండకుండా, ఎదిగే వారిగా ఉండాలి.

## తంత్ర బోధల నుండి విడుదల

### ఎఫెసీయులకు 4 : 14 – 15

**14 అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయముల చేత వంచనతోను, తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనిపోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొని పోవుచు అలల చేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండక**
**15 ప్రేమగలిగి సత్యము చెప్పుచు క్రీస్తు వలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము.**

తంత్రముతో కూడిన బోధల నుండి, అబద్ధ ప్రవక్తల నుండి, లోభుల నుండి తప్పించబడాలంటే, మనం ఇక చిన్న పిల్లల్లా ఉండకుండా, ప్రేమతో సత్యాన్ని పాటించి శిరస్సైన క్రీస్తులో అన్ని విషయాల్లో ఎదిగే వారిగా ఉంటే వంచకుల నుండి తప్పించుకోవచ్చు. వీరి నుండి తప్పించుకోవడానికి దేవుని కుమారుడిని పట్టుకునే అతి పరిశుద్ధమైన సత్యానికి ఏకమనస్సు గలవారిగా, మనం సత్యంలో స్థిరపడి భక్తి వృద్ధి చెందేలా దేవుడు అపొస్తలులను, ప్రవక్తలను, బోధకులను, కాపరులను ఇప్పటికే

నియమించాడు **(ఎఫెసీయులకు 4:11-13)**. ఆ తర్వాత అపొస్తలులను నియమించలేదు. వీరి ద్వారా చెప్పబడిన బోధల ద్వారా, ప్రవచనాల ద్వారా, సువార్త ద్వారా, పత్రికల ద్వారా ఏర్పరచినవి తప్ప వేరే ఎటువంటి కొత్త రకమైన ఉపదేశం ఇవ్వబడలేదు. అలా కొత్తగా ఏది చెప్పినా, వారు మానవ బోధలు చెప్పే వారే తప్ప సత్య బోధలు చెప్పే వారు కాదు. దీని గురించి పౌలు **గలతీయులకు 1:7-10** లో - వేరే సువార్త ఏదీ లేదు. వేరే ఏదైనా సువార్త చెప్పే వారు క్రీస్తు సువార్తను మారుస్తున్న వారు. చెప్పబడిన సువార్త కంటే వేరొకటి లేదు. వేరొక సువార్తను ప్రకటించేవాడు శాపగ్రస్తుడు అని చెప్పాడు. కాబట్టి, ఈ తంత్రమైన బోధలను విడిచి బయటకు రావాలంటే, యేసుక్రీస్తు ద్వారా అపొస్తలుల ద్వారా చెప్పబడిన ఉపదేశంలో అలవాటు పడిన వారే వీటి నుండి బయటకు రాగలరు. కాబట్టి, మూడవ శతాబ్దం తర్వాత చెప్పబడిన బోధలలో ఎక్కువ బోధలు మానవ బోధలే. అది ఇప్పటి వరకు ప్రజల మధ్య మాట్లాడబడుతోంది. ఇదే తంత్రముతో కూడిన బోధ. సత్యాన్ని మాట్లాడిన అపొస్తలులను ఆ రోజుల్లో మత విరోధులుగా మాట్లాడేవారు అని నిందించారు. అలాగే నేడు మానవ బోధకులు, సత్యాన్ని మాట్లాడే వారిని నిందిస్తున్నారు.

## అపొస్తలుల కార్యములు 28 : 22

**అయినను ఈ విషయమై నీ అభిప్రాయము నీ వలన వినగోరుచున్నాము; ఈ మతభేదమును గూర్చి అంతట ఆక్షేపణ చేయుచున్నారు ఇంతమట్టుకు మాకు తెలియుననిరి.**

ఈ సత్యము మరియు దేవుని పిలుపు ఆదిమ సంఘంలో మాత్రమే కాదు, నేడు కూడా ప్రసిద్ధంగా అంగీకరించబడదు. మానవ కల్పితాల వల్ల సాతాను బోధల వల్ల అతి పరిశుద్ధమైన విశ్వాసం పాడైపోయి నేడు అన్ని సంఘాల్లో నకిలీ బోధలు జరుగుతున్నాయి. నిజమైన సత్యం వారికి మత

విరోధంగా మాట్లాడేదిగా నేడు మాట్లాడబడుతోంది. ఎలా యేసు ద్వారా చెప్పబడిన సత్యం ధర్మశాస్త్ర బోధకుల ద్వారా మత విరోధులుగా చెప్పబడిందో, అలాగే నేటి సాతాను బోధలకు, మానవ బోధలకు బోధకులుగా ఉన్నవారు, సత్యాన్ని మాట్లాడే వారిని మత విరోధులు అని చెబుతున్నారు. ఎలాగంటే ఆ రోజుల్లో సత్యాన్ని మాట్లాడిన పౌలును ప్లేగు వ్యాధిగా అన్నదాని అర్థం ఏమిటంటే - ప్లేగు వ్యాధి వలె సత్యం వ్యాపించడం వలన, యూదుల మరియు క్రైస్తవుల మధ్య అల్లరి కలిగిస్తున్నాడని, యేసు యొక్క మత భేదం అనేది ప్రేమ ముసుగులో జనులను వంచించే దుర్బోధ చేసేవారు అని చెప్పబడుతోంది. పౌలు రోజుల్లో ఎలా సత్యాన్ని వ్యతిరేకించారో, అదే స్థితిలోనే నేడు సత్యాన్ని మాట్లాడే వారిని వ్యతిరేకిస్తున్నారు **(అపొస్తలుల కార్యములు 24:5)**. కాబట్టి, మానవుని ద్వారా బోధించబడిన కల్పితాలను విసిరివేసి అతి పరిశుద్ధమైన విశ్వాసపు నిజమైన సత్యాన్ని అనుసరించడానికి వాక్యంలో పసిపిల్లల్లా ఉండకుండా ఎదిగే వారిగా ఉండాలని మన విశ్వాసాన్ని అతి పరిశుద్ధమైన విశ్వాసంలో స్థిరపరచుకోవడానికి దేవుడు మనల్ని పిలిచాడు.

**యోహాను 17 : 17**
**అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పగా**

**యోహాను 8 : 32**
**నీ వాక్యమే సత్యము.**

దేవుడు తానే అతి పరిశుద్ధమైన విశ్వాసంలో స్థిరంగా ఉండటానికి సహాయం చేయును గాక!

# ఆమేన్



# పరలోక దేవ మినిస్ట్రీస్



## సమర్పించు

## Free Bible Study (Telugu)

మరింత సమాచారం కోసం సంప్రదించగలరు.

+91 730 53 53 23 5 freebiblestudytelugu@gmail.com